సాక్షి తిరుపతి

గురువారం । 23 । మే । 2024



ఆర్‌ఓలదే కౌంటింగ్ బాధ్యత

సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో రిటర్నింగ్ అధికారులదే పూర్తి బాధ్యతని కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. - 8లో



యోగ నృసింహుని వైభోగం

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారు సింహ, గరుడ వాహనాలపై ఊరేగారు. - 8లో



కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి బుధవారం భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. - 8లో

న్యూస్‌రీల్

శారదా పీఠాధిపతిని కలిసిన టీటీడీ చైర్మన్ భూమన



స్వరూపానందేంద్ర సరస్వతితో మాట్లాడుతున్న టీటీడీ చెర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుమల: టీటీడీ చైర్మన్, తిరుపతి ఎమ్మెల్యే భువన కరుణాకర్ రెడ్డి బుధవారం విశాఖ శారదా పీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామిని మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుమలలోని శారదాపీఠం కుటీరం వద్ద కలిసి మాట్లాడారు. పీఠాధిపతి ఆశీస్సులు అందుకున్నారు.

అల్పపీడనం.. కడలి కల్లోలం



తూపిలిపాళెం బీచ్‌లో ఎగసిపడుతున్న అలలు

వాకాడు : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో బుధవారం సముద్రం అల్లకల్లోలంగా మారింది. మండలంలోని తూపిలిపాళెం వద్ద సుమారు 5 నుంచి 10 అడుగుల ఎత్తు వరకు అలలు ఎగసిపడుతున్నాయి. ప్రస్తుతం వేట విరామం సమయం కావడంతో మత్స్యకారులు తీరానికే పరిమితమయ్యారు. అయినప్పటికీ మండలంలోని తూపిలిపాళెం, కొండూరుపాళెం, దుగరాజపట్నం, అంజలాపురం, శ్రీనివాసపురం, పంబలి, పులింజేరివారిపాళెం, మొనపాళెం, ఓడపాళెం, వైట్‌కుప్పం, పామంజి, పూడికుప్పం, పూడిరాయిదొరువు, చినతోట, నవాబుపేట గ్రామాల మత్స్యకారులు ముందస్తు జాగ్రత్తగా తమ వేట సామాగ్రిని భద్రపరుచుకుంటున్నారు. తీర ప్రాంతంలో అప్పుడప్పుడు తుంపర్ల వర్షంతోపాటు ఈదురు గాలులు వీస్తున్నాయి.

శాస్త్రోక్తంగా శ్రీ నృసింహ పూజ



నృసింహ స్వామికి హారతిస్తున్న అర్చకులు

తిరుమల: వైశాఖ మాస ఉత్సవాల్లో భాగంగా శ్రీ నృసింహ జయంతిని పురస్కరించుకుని తిరుమల వసంత మండపంలో బుధవారం శ్రీ నృసింహ పూజ శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం 3 నుండి 4.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేసింది. ఇందుకోసం శ్రీవారిని నృసింహస్వామి అలంకారంలో సింహ వాహనంపై కొలువు దీర్చారు. సుదర్శన చక్రం, నరసింహుని ప్రతిమను ఏర్పాటు చేశారు. అభిముఖంగా నరసింహ స్వామి ప్రతిమలను ఆశీనులను చేశారు. శ్రీ నృసింహ మంత్రాన్ని 108 సార్లు, నృసింహ అష్టోత్తర శతనామావళి, సుదర్శన మంత్రాన్ని 24 సార్లు పారాయణం చేశారు. కార్యక్రమంలో శ్రీవారి ఆలయ అర్చకులు, ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం పండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో..

తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం నృసింహ జయంతి నిర్వహించారు. శ్రీ యోగనరసింహస్వామివారి మూలమూర్తికి ప్రత్యేక అభిషేకం చేశారు.

సందర్శకుల సంతకం తప్పనిసరి



సందర్శకుల రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : తిరుపతి శ్రీపద్మావతి మహిళా యూనివర్సిటీలోని ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ను బుధవారం రాత్రి జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన సందర్శకుల పుస్తకంలో సంతకం చేశారు. అనంతరం ఎన్నికల అధికారి మాట్లాడుతూ ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ వద్ద అనుక్షణం అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రం వద్ద వెళ్లాలంటే సందర్శకుల పుస్తకంలో సంతకం చేయడం తప్పనిసరని స్పష్టం చేశారు. కౌంటింగ్ పూర్తయ్యే వరకు కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీనివాసరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.





తాతయ్యగుంట గంగమ్మ విశ్వరూప దర్శనానికి విచ్చేసిన అశేష భక్తులు (ఇన్‌సెట్) అమ్మవారి విరాట్ స్వరూపం

పరిపూర్ణం.. అమ్మ సంబరం

గంగమ్మతల్లీ.. కరుణించమ్మా అంటూ అమ్మ నామస్మరణతో తిరునగరి మార్మోగింది. కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా ప్రసిద్ధి చెందిన తాతయ్యగుంట గంగమ్మ సేవకు అశేష భక్తజనం పోటెత్తింది. డప్పులు దరువులు.. కనువిందు చేసిన వేషధారులతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. అమ్మవారి విశ్వరూప దర్శనంతో జాతర పరిపూర్ణమైంది. మహిమాన్విత స్వరూపాన్ని కనులారా వీక్షించిన భక్తకోటి పులకించింది. పవిత్ర ప్రతిమ మన్నును చేతపట్టి తరించింది.

- అత్యంత వైభవంగా తాతయ్యగుంట గంగమ్మ జాతర
- అమ్మవారి విశ్వరూప దర్శనంతో పులకించిన భక్తజనం
- ఘనంగా ముగిసిన మహోత్సవం

తిరుపతి కల్చరల్ : తిరుపతి శ్రీతాతయ్యగుంట గంగమ్మ జాతర అత్యంత వైభవంగా సాగింది. ఏడు రోజులపాటు గంగమ్మ జానపద జాతర సంబరం అంబరాన్నంటింది.చివరిరోజైన మంగళవారం లక్షలాది మంది భక్తి శ్రద్ధలతో గంగమ్మతల్లిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ వేషాలు ధరించి వేషధారణలతో భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. భక్తి ప్రపత్తులతో కుటుంబ సమేతంగా పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు.



అమ్మవారి పవిత్ర ప్రతిమ ఎదుట ఆలయ కమిటీ చైర్మన్, సభ్యులు



గంగమ్మ ప్రతిమ మన్ను కోసం భక్తుల ఆరాటం

పకడ్బందీగా నిర్వహణ

తిరుమల శ్రీవారి చెల్లెలుగా ప్రాచీన చరిత్ర కలిగి భక్తకోటి పూజలందుకుంటున్న తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ప్రాశస్త్యం, జాతర వైభవాన్ని చాటుతూ ఎమ్మెల్యే, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి పిలుపు మేరకు అమ్మ సంబరాన్ని పకడ్బందీగా నిర్వహించారు. ఈ నెల 14వ తేదీ అర్ధరాత్రి చాటింపుతో మొదలైన జాతరను ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా సజావుగా పూర్తి చేశారు. మొత్తం ఏడురోజుల్లో లక్షలాది మంది భక్తులు గంగమ్మ ఆలయానికి తరలివచ్చినా ఎవరూ ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు చేశారు. పోలీసులు సైతం పటిష్ట బందోబస్తు కల్పించారు. తిరుపతివాసులకు మరో మధురైన అనుభూతిని మిగిల్చారు.

మహిమాన్వితం.. విరాట్ రూపం

తాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి కొలువుదీరిన విశ్వరూప ప్రతిమ దర్శనంతో భక్తులు తన్మయత్వం చెందారు. కాపాడు తల్లీ అంటూ అమ్మవారి విశ్వరూపానికి చేతులెత్తి మొక్కుతూ వేడుకున్నారు. ఈ క్రమంలో ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక గ్యాలరీల్లోకి వేలాది మంది చేరుకున్నారు. అమ్మ దర్శనం కోసం ఉవ్విళ్లూరుతూ ఎదురు చూశారు. గంగమ్మ విశ్వరూపం దర్శనం చేసుకుని హారతులు సమర్పించారు. అత్యంత పవిత్రంగా భావించే విశ్వరూప ప్రతిమ బంకమట్టి కోసం పోటీ పడ్డారు. అనంతరం పేరంటాలు శ్రీతాళ్లపాక పెద్ద గంగమ్మ ఆలయానికి చేరుకుని అక్కడ కొలువైన పెద్ద గంగమ్మ విశ్వరూప ప్రతిమ చెంప నరకడంతో జాతర ఘట్టం పరిపూర్ణమైంది.

టీడీపీ మూకల విధ్వంసాలపై కుట్రకోణం దాగి ఉందా..? పక్కా ప్లాన్‌తోనే అల్లర్లకు తెగబడ్డారా..? ఓటమి భయంతోనే దాడులకు పాల్పడ్డారా..? పథకం ప్రకారమే చంద్రబాబు సొంత నియోజకవర్గంలో పచ్చముఠా చెలరేగిపోయిందా..? మహిళా వర్సిటీ వద్ద పులివర్తి నాని కావాలనే రెచ్చిపోయారా..? 144 సెక్షన్ అమలులో ఉన్నా వైఎస్సార్‌సీపీ శ్రేణులను కవ్వించేందుకే మారణాయుధాలు చేతపట్టిన గ్యాంగ్‌తో అక్కడకు వచ్చారా..? ఎలాంటి గాయం కాకపోయినా కేవలం సానుభూతి కోసమే నాటకాలాడారా..? ధర్నాలో కూర్చున్నప్పుడు నిక్షేపంగా కనిపించిన నాని.. అంతలోనే ఎందుకు అస్వస్థతకు గురయ్యారు..? సిట్ అధికారులను తప్పుదోవ పటించేందుకే వంటి నిండా కట్టుకట్టించుకున్నారా..? నాటి ఘటనకు సంబంధించిన ఆడియో.. వీడియోలను పరిశీలిస్తే అవుననే అర్థమవుతోంది. పోలింగ్ రోజు.. మరుసటి రోజు దాడుల వెనుక కక్షపూరిత పథకం దాగి ఉందని స్పష్టమవుతోంది.



144 సెక్షన్ నిబంధనలను బేఖాతర్ చేసిన పచ్చమూక (ఫైల్)

పులివర్తి నానీ.. ఈ ప్రశ్నలకు బదులేది?

- పక్కా పథకం ప్రకారమే కదా దాడులు?
- వాహనం వెళ్లేందుకు అవకాశమున్నా ఆగారు కదా?
- ఆయుధాలు అదే సమయానికి ఎలా వచ్చాయి?
- ముట్టుకోవద్దు.. ఆధారాలు చెరిగిపోతాయని ఎందుకన్నారు?
- ఇనుపరాడ్‌తో కొట్టినా పోలీసులు ఎందుకు ఫిర్యాదు చేయలేదు?
- పచ్చమూక విధ్వంసకాండపై పలు అనుమానాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : శ్రీపద్మావతీ మహిళా యూనివర్సిటీ వద్ద జరిగిన విధ్వంస కాండలో టీడీపీ నేతలు, పోలీసుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పోలింగ్ రోజు నుంచి మరుసటి రోజు వరకు జరిగిన దాడుల వెనుక కుట్ర కోణం దాగి ఉందని విచారణ అధికారులు సైతం భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఆడియోలు, వీడియోలు పరిశీలిస్తే మొత్తం ఘటనలో చంద్రగిరి టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, అనుచరులు, గన్‌మన్, మరో నలుగురు పోలీసుల పాత్ర ఉన్నట్లు అర్థమవుతోంది. ముఖ్యంగా చంద్రబాబు సొంత నియోజక వర్గంలోనే ఈ విధ్వంసాలు చోటు చేసుకోవటం వెనుక టీడీపీ నేతలు, కొందరు పోలీసు అధికారుల హస్తం ఉన్నట్లు సిట్ అధికారులు తన నివేదికలో పొందుపరిచినట్లు తెలిసింది. పోలింగ్ రోజున రామచంద్రాపురం మండలం బ్రాహ్మణకాలువ, చంద్రగిరి మండలం కాశిపెంట్ల, చంద్రబాబు స్వగ్రామం నారావారిపల్లె పరిధిలోని కందులవారిపల్లె, పాకాల మండలం ఆదినపల్లె పోలింగ్ బూత్‌లలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై టీడీపీ నేతలు దాడులకు తెగబడిన విషయం విధితమే. అదే రోజు రాత్రి రామిరెడ్డిపల్లెలో సర్పంచ్ ఇంటిని పచ్చగూండాలు తగులబెట్టారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మోహిత్‌రెడ్డి కారుకి నిప్పుపెట్టారు. మరో కారుని ధ్వంసం చేశారు. అంతటితో ఆగని టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, అనుచరులు ఈవీఎంలను భద్రపరచిన మహిళా యూనివర్సిటీ వద్ద మరింతగా రెచ్చిపోయారు. ఈ విధ్వంసం అంతా పక్క ప్లాన్ అనడానికి వెలుగులోకి వచ్చిన వీడియోలు, ఆడియోలే నిలువెత్తు సాక్ష్యం.

అందుకే కెమెరాలు అమర్చుకున్నారా?

దాడులన్నీ ముందస్తు ప్రణాళికలో భాగమేనని తెలుస్తోంది. కొటాలలో జరిగిన ఘర్షణలకు ముందే పులివర్తి నాని, అనుచరుల వాహనాలకు కెమెరాల అమర్చుకొని విధ్వంసాలకు తెగబడినట్లు సమాచారం. దాడుల తర్వాత రోడ్డుపై పడి ఉన్న బీరు బాటిళ్ల, రాళ్లు, రాడ్లు తీసేసేందుకు కొందరు ప్రయత్నిస్తుంటే.. పులివర్తి నాని గన్‌మన్ కల్పించుకుని 'వాటిని తాకొద్దు. అవి ఎవిడెన్స్' అంటున్నాడే తప్ప వీఐపీ ఎక్కడున్నాడో అతని వద్దకెళ్దామనే ఆలోచన కూడా చేయలేదని తెలుస్తోంది. గన్‌మన్‌కి ఎవిడెన్స్‌తో పనేంటి? పోలీసులు చూసుకుంటారు కదా? ఇదిలా ఉంటే.. వీఐపీ మీద దాడి జరుగుతుందని తెలిసిన వెంటనే స్థానిక డీఎస్పీ లేదా సీఐకి సమాచారం ఇవ్వాలి. ఇది చెయ్యకుండా.. సాక్ష్యాలు అంటూ వాటి కోసం కెమెరాలు ఏర్పాటు చేసుకుని, వస్తువులను తాకొద్దని మాట్లాడడం వెనుక అంతర్యం ఏమిటి? దాడి జరిగిందన్నారు, ఆ తర్వాత ధర్నాకు కూర్చున్నారు. ఆ సమయంలో చేతులు, కాళ్లు బాగానే ఉన్నాయి. సుమారు రెండు గంటల తర్వాత గాయాలైనట్టు ఆస్పత్రిలో చేర్చారు. చేతికి, కాలికి కట్లు కట్టుకున్నారు బాగానే ఉంది. రెండు రోజులకే గాయాలు నయమైపోయాయా? సాక్షి పత్రికలో ఫొటోలతో ప్రచురించాక.. మళ్లీ చేతికి, కాలికి కట్లు కనిపించాయి. ఆ కట్లతోనే సిట్ అధికారులకు వినతి పత్రం ఎలా ఇచ్చారు నాని అన్నయ్య గారూ? విధ్వంసాల వెనుక ఎవరి హస్తం ఉందో నిగ్గుతేల్చి తమకు న్యాయం చేయాలని బాధితులు కోరుతున్నారు.

దాడికి ప్రతి దాడి ఏ చట్టం చెప్పింది?

మహిళా యూనివర్సిటీ వద్ద టీడీపీ అభ్యర్థి పులివర్తి నానిపై వైఎస్సార్‌సీపీ నాయకులు దాడులు చేశారని ప్రధాన ఆరోపణ. ఆ దాడిలో తన చేయి, కాలికి తీవ్ర గాయం అయినట్లు ఆస్పత్రిలో చేరి కట్లు కట్టుకుని నానా హంగామా చేసిన విషయం తెలిసిందే. అయితే నానిపై దాడి జరగలేదు.. ఆయన చేయి, కాలికి ఎలాంటి గాయాలు కాలేదు అనడానికి అనేక ఆధారాలు ఉన్నాయి. ఇదంతా పులివర్తి నాని, కొందరు పోలీసులు పథకం ప్రకారం చేసిన అరాచకమని ఆడియో, వీడియో రికార్డుల ద్వారా స్పష్టమవుతోంది. ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్ పరిసర ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉన్నా అంత మంది రాడ్లు, బీరు బాటిళ్లు, కర్రలు, రాళ్లతో అక్కడికి చేరుకోవాల్సిన అవసరం ఏమొచ్చింది? పులివర్తి నాని ప్రయాణిస్తున్న కారు మహిళా యూనివర్సిటీ వద్ద ఉన్నట్లుండి ఆగింది. కారు వెనుక గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో కారుపై దాడి చేసే సమయంలో పులివర్తి నానిని గన్‌మన్ సురక్షితమైన ప్రాంతానికి తీసుకెళ్లమని డ్రైవర్‌కి ఆదేశాలు ఇవ్వాలి. వీఐపీని కాపాడుతూ.. తనను తాను కాపాడుకోవాల్సిన బాధ్యత గన్‌మన్ తక్షణ కర్తవ్యం. అలా కాకుండా వాహనాన్ని ఎందుకు ఆపారు? దాడి జరిగే సమయంలో గన్‌మన్ ఎందుకు కారు ఎందుకు దిగాల్సి వచ్చింది? అపాయాన్ని పసిగట్టిన గన్‌మన్ వెంటనే పులివర్తి నానిని అక్కడి నుంచి సురక్షితమైన ప్రాంతానికి తరలించాలి. అయితే అక్కడ కారు ఆపి ఎందుకు ప్రతిదాడికి దిగాల్సి వచ్చింది? ముందు గన్‌మన్, తర్వాత పులివర్తి నాని కారు దిగి పరుగెత్తడం వీడియోల్లో కనిపించింది. దాడి జరిగే సమయంలో అక్కడి నుంచి సురక్షితమైన ప్రాంతానికి వెళ్లేందుకు ఎటువంటి ఆటంకాలు లేవు. నాని కారు దిగి అటువైపు వెళ్లిన కొద్దిసేపటికే తుపాకీ కాల్పుల మోత వినిపించింది. ఈ క్రమంలోనే తుపాకీతో పులివర్తి నాని కాల్చారు అనటానికి ఆడియో రికార్డు ఒకటి బయటపడింది. నాని అనుచరుడా? గన్‌మన్ ? ఇద్దరిలో ఒకరు వేరొకరికి ఫోన్‌చేసి 'ఇక్కడ గొడవ జరుగుతోంది. అన్న ఫైర్ చేశాడు. వెంటనే అందరూ రండి' అని పిలుపు నివ్వడం ఆడియోలో వినిపించింది. తుపాకీ ఫైర్ అయిన సమయంలో గన్‌మన్ వేలికి గాయమైనట్లు తెలుస్తోంది. పులివర్తి నాని తుపాకీ పేల్చలేదు అనుకుంటే.. వేలికి గాయమైన గన్‌మన్ ఎలా ట్రిగర్ నొక్కి గాల్లోకి కాల్పులు జరుపుతారు? వైఎస్సార్‌సీపీ శ్రేణులను రెచ్చగొట్టి అటాక్ చేయించుకునే విధంగా వ్యవహరించారనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.



వైఎస్సార్‌సీపీ నేత కారును ధ్వంసం చేస్తున్న టీడీపీ గూండా



పచ్చమూకా దాడిలో ధ్వంసమైన పోలీస్ వాహనం (ఫైల్)



దాడి అనంతరం ధర్నాలో నిక్షేపంగా పులివర్తి నాని(ఫైల్)



ఇనుప రాడ్లతో పచ్చ రౌడీల వీరంగం (ఫైల్)

శ్రీవారి దర్శనానికి 18 గంటలు

తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. క్యూ కాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలైన్ టీబీసీ వద్దకు చేరుకుంది. మంగళవారం అర్ధరాత్రి వరకు 80,744 మంది స్వామివారిని దర్శించుకోగా 35,726 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 3.67 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 18 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.1.42 కోట్లు



హుండీ ఆదాయం లెక్కిస్తున్న ఉద్యోగులు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ ఆదాయం రూ.1,42,89,870 లభించిందని ఈఓ ఎస్వీ నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆలయంలోని గురుదక్షిణామూర్తి సన్నిధి హుండీల ఆదాయం లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా బంగారు 72 గ్రాములు, వెండి 487.800 కిలోలు, విదేశీ కరెన్సీ నోట్లు 124 వచ్చాయి. 27 రోజుల పాటు వచ్చిన హుండీ ఆదాయం అని ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏనుగుల దాడిలో పంటల ధ్వంసం



పాకాల : మండలంలోని ఈ-పాలగుట్టపల్లె పంచాయతీ పరిధిలోని పొలాలపై ఏనుగుల గుంపు మంగళవారం రాత్రి దాడి చేసింది. పలువురు రైతులకు చెందిన పంటలను నాశనం చేసింది. గజరాజుల వరుస దాడులతో పంటలను నష్టపోతున్నామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అటవీశాఖ అధికారులు వెంటనే స్పందించి ఏనుగుల గుంపును దారి మళ్లించాలని, నష్టపోయిన పంటలకు పరిహారం అందించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు.



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.76,490
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.6,851
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.95,700
రిటైల్ వెండి గ్రాము రూ.97.70

క్లుప్తంగా

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న లారీ


రోడ్డుపై పడిపోయిన విద్యుత్ స్తంభం

చిల్లకూరు: మండలంలోని పారిచెర్లవారిపాళెం నుంచి తిప్పగుంటపాళెం మార్గంలో బుధవారం ఓ లారీ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. వివరాలు.. సాగరమాల రహదారి పనులు కోసం వెళుతున్న సిమెంట్ మిక్సర్ లారీ అదుపుతప్పి ఢీకొనడంతో విద్యుత్ స్తంభం రోడ్డుపై పడిపోయింది. స్థానికులు అప్రమత్తమై వెంటనే సమాచారం అందించడంతో ట్రాన్స్‌కో సిబ్బంది విద్యుత్ సరఫరాను నిలిపివేశారు.అనంతరం స్తంభం తొలగించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

కాణిపాకంలో భక్తుల రద్దీ

కాణిపాకం: కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం బుధవారం భక్తజనంతో కిక్కిరిసింది. ఉదయం నుంచి రాత్రి వరకు కూడా భక్తులతో ఆలయం రద్దీగా కనిపించింది. ఉచిత దర్శన క్యూలైన్లు నిండుకున్నాయి. ఆలయ అధికారులు భక్తుల రద్దీ దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకున్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించేందుకు పూనుకున్నారు. మరో పది రోజుల పాటు ఆలయానికి భారీగా రద్దీ ఉండవచ్చని అధికారులు భావిస్తున్నారు. ఆమేరకు ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నారు.

శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసిన వెంగమాంబ

- శతావధాని ఆముదాల మురళి
- ముగిసిన తరిగొండ వెంగమాంబ జయంత్యుత్సవాలు


అన్నమాచార్య కళామందిరంలో నిర్వహించిన సాహితీ సదస్సులో మాట్లాడుతున్న శతావధాని ఆముదాల మురళి


వెంగమాంబకు నివాళులర్పిస్తున్న టీటీడీ వెంగమాంబ ప్రాజెక్టు సంచాలకుడు భూమన సుబ్రమణ్యం రెడ్డి

తిరుపతి కల్చరల్: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ సామాన్యులు సైతం అర్థం చేసుకునే ప్రజాకవిత్వం ద్వారా శ్రీవేంకటేశ్వరస్వామి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేశారని శతావధాని ఆముదాల మురళి (తిరుపతి) అన్నారు. అన్నమాచార్య కళామందిరంలో తరిగొండ వెంగమాంబ రెండు రోజుల జయంత్యుత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ముగింపు రోజు తరిగొండ వెంగమాంబ సాహిత్యంపై నిర్వహించిన సదస్సుకు అధ్యక్షత వహించిన మురళి మాట్లాడారు. వెంగమాంబ రచనలు నాటి సమాజంలోని రుగ్మతలను ప్రశ్నిస్తూ ప్రస్తుత సమాజానికి అదర్శంగా నిలిచాయన్నారు. వెంగమాంబ తన జీవితాన్ని స్వామివారి కైంకర్యానికి అంకితం చేశారని, ఆమె వ్యక్తిగా, సంస్కర్తగా, యోగినిగా, కవయిత్రిగా శ్రీవారి భక్తితత్వాన్ని ప్రచారం చేశారని కీర్తించారు. అనంతరం డాక్టర్ వీఆర్.రాసాని 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ- జీవిత విశేషాలు' అనే అంశంపై ఉపన్యసించారు. వెంగమాంబ బాల్యంలోనే భర్తను కోల్పోయినా వైధవ్యాన్ని అంగీకరించలేదని దీనికి కారణం శ్రీవేంకటేశ్వరస్వామిని తన భర్తగా భావించిందన్నారు. అన్నమయ్య కీర్తనలతో స్వామివారిని ఆరాధించగా, వెంగమాంబ గద్య, పద్యం, యక్షగానాలతో తన భక్తిని చాటుకుందన్నారు. డాక్టర్ కేశవులు 'మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ–సాహిత్యం, వర్ణనలు' అనే అంశంపై ఉపన్యసించారు. ఆమె వివిధ సాహితీ ప్రక్రియలలో 18 గ్రంథాలను రచించిన మొదటి తెలుగు కవయిత్రి అని కీర్తించారు. ప్రాచీన కవులకు దీటుగా, ప్రబంధాలకు పోటీగా తరిగొండ వెంగమాంబ అష్టాదశ వర్ణనలు చేశారని ఉదాహరణలతో వివరించారు. డాక్టర్ బాలాజీ దీక్షితులు 'తరిగొండ వెంగమాంబ–తెలుగు సాహిత్య సౌరభం' అనే అంశంపై ఉపన్యసించారు. ఆమె ఆంజనేయస్వామి గురించి తపస్సు చేసిన అటవీ మార్గం యోగ సాధన రహస్యాలు తెలిపే మార్గమన్నారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 వరకు అన్నమాచార్య ప్రాజెక్టు, ఎస్వీ సంగీత, నృత్య కళాశాల విద్యార్థులు సంకీర్తనలు ఆలపించారు.


కీర్తనలు ఆలపిస్తున్న కళాకారులు

వెంగమాంబకు పుష్పాంజలి

తిరుమల:18వ శతాబ్దపు శ్రీ వేంకటేశ్వర స్వామివారి పరమ భక్తుల్లో ఒకరైన మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతిని తిరుమలలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో బుధవారం సాయంత్రం టీటీడీ వెంగమాంబ ప్రాజెక్టు సంచాలకులు భూమన్ సుబ్రమణ్యం రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఆయన మాట్లాడుతూ వెంగమాంబ వేంకటేశ్వరుడు, తరిగొండ లక్ష్మీ నృసింహస్వామిపై గొప్ప రచనలు చేశారని అన్నారు. వెంగమాంబ ప్రాజెక్టు ద్వారా టీటీడీ ఆమె సాహిత్యాన్ని ప్రచారం చేస్తూ, ప్రతి ఏటా తరిగొండ, తిరుపతి, తిరుమలలో జయంతి ఉత్సవాలను నిర్వహిస్తోందని చెప్పారు. శ్రీవారికి ఏకాంతసేవ సమయంలో అన్నమయ్య లాలి – వెంగమాంబ ముత్యాలహారతి ఇప్పటికీ కొనసాగుతున్నాయని వివరించారు. అంతకు ముందు నాద నీరాజనం వేదికపై టీటీడీ ఆస్థాన విద్వాంసులు డాక్టర్ బాలకృష్ణ ప్రసాద్‌తో పాటు ప్రముఖ అన్నమాచార్య ప్రాజెక్టు గాయని శ్రీమతి బుల్లెమ్మ వెంగమాంబ రచించిన కీర్తనలను శ్రావ్యంగా ఆలపించారు. కార్యక్రమంలో క్యాటరింగ్ ప్రత్యేకాధికారి జీఎల్ఎన్ శాస్త్రి, వెంగమాంబ వంశీయులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్త్రీ శక్తికి ప్రతీక.. వెంగమాంబ
శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

తిరుమల : మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ స్త్రీ శక్తికి, సాధికారతకు ప్రతీకని విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామిస్వామీజీ తెలిపారు. బుధవారం తిరుమలలో నిర్వహించిన వెంగమాంబ జయంతి ఉత్సవాల్లో స్వామీజీ అనుగ్రహభాషణం చేశారు. ఆనాటి సామాజిక పరిస్థితుల్లో చాలా కష్టాలు అనుభవించి పరమాత్మని దర్శిస్తూ ఆమె జ్ఞానమూర్తిగా అవతరించారని వెల్లడించారు. వెంగమాంబ రచనలను సాక్షాత్తు శ్రీవారు అంగీకరించినట్టు చెప్పారు. వెంగమాంబ రచించిన వేంకటాచల మహత్యం అత్యంత పవిత్రమైందని తెలిపారు. 87 ఏళ్ల వయసులో శ్రీవారి ఆమోదంతో వెంగమాంబ సజీవ సమాధి అయ్యారని వివరించారు. ఈ క్రమంలోనే స్వామీజీ వెంగమాంబ సంకీర్తనల రెండు పుస్తకాలు, సీడీ విడుదల చేశారు.

ప్రశాంత వాతావరణంలో ఓట్ల లెక్కింపే లక్ష్యం


మాట్లాడుతున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

శ్రీకాళహస్తి: ఓట్ల లెక్కింపు ప్రశాంత వాతావరణంలో జరగాలని తిరుపతి జిల్లా నూతన ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. బుధవారం ఆయన స్థానిక డీఎస్పీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సజావుగా నిర్వహించేందుకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో తనకు అప్పగించిన బాధ్యతను సవాల్‌గా భావించి ప్రశాంతంగా ముగిసేలా చూడటమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమన్నారు. దీనికి సంబంధించి పకడ్బందీ ప్రణాళికలతో బందోబస్తు ఏర్పాటు చేసి ముందుకెళ్తామన్నారు. ప్రజలు, రాజకీయ ప్రతినిధులు చట్టానికి వ్యతిరేకంగా నడుచుకోరాదని హితవు పలికారు. అలాగే ఈ విషయంలో పాత్రికేయుల సహకారం కూడా తమకు అవసరం ఉందన్నారు. ఇక, తిరుపతిలో పద్మావతి కళాశాల వద్ద జరిగిన ఘటనపై ఇప్పటికే పలువురిని విచారణ చేస్తున్నామని, కొంతమందిని బైండోవర్ చేసుకుని రిమాండ్‌కు తరలించామన్నారు. తిరుపతి, చంద్రగిరిలో మరికొందరి కోసం గాలిస్తున్నామని, త్వరలో వారిని కూడా పట్టుకుని విచారణ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ, సీఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

విద్యానగర్‌లో కార్డెన్ సెర్చ్

కోట : విద్యానగర్‌లోని ప్రకాశం కాలనీ,ఎన్టీఆర్ కాలనీలో బుధవారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. వాకాడు సర్కిల్ పరిధిలోని పోలీసులు ప్రతి ఇంటినీ జల్లెడ పట్టారు.అనుమానితులను విచారించారు. సరైన పత్రాలు లేని 20 మోటార్‌బైక్‌లు,7 ఆటోలను స్వాధీనం చేసుకుని కోట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా వాకాడు సీఐ హరికృష్ణ మాట్లాడుతూ నేరనియంత్రణకు, అసాంఘిక కార్యకలాపాల కట్టడికి కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో ఉందని కౌంటింగ్ ప్రక్రియ పూర్తి అయ్యే వరకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎస్ఐలు నాగబాబు, పవన్‌కుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ లాక్కెళ్లిన దొంగలు

నాగలాపురం: ఓ యువకుడు సెల్‌ఫోన్ చూస్తుండగా ద్విచక్ర వాహనంలో వచ్చిన ఆగంతకులు లాక్కెళ్లిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు.. స్థానిక మసీదు పక్కన కాపురం ఉన్న హమీదుల్లా మంగళవారం రాత్రి 11.30 గంటలకు తన ఇంటి ముందు రోడ్డు పక్కన నిలబడి తన మొబైల్ చూస్తుండగా ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైకు మీద వచ్చి తన చేతిలో ఉన్న మొబైల్‌ను లాక్కొని పారిపోయారు. ఎస్ఐ ఓబయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే


మంత్రి పెద్దిరెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి రాజేష్, వైఎస్సార్‌సీపీ నేతలు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

వరదయ్యపాళెం: రాష్ట్రంలో మళ్లీ అధికారంలోకి రాబోయేది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమే అని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి స్పష్టం చేశారు. బుధవారం తిరుపతిలోని నివాసంలో మంత్రి పెద్దిరెడ్డిని సత్యవేడు ఎమ్మెల్యే అభ్యర్థి నూకతోటి రాజేష్, వరదయ్యపాళెం వైఎస్సార్‌సీపీ నేతలు కలిశారు. మంత్రి పెద్దిరెడ్డి మాట్లాడుతూ రాజేష విజయానికి పార్టీ నేతలు, కార్యకర్తల కృషి అభినందనీయమన్నారు. పార్టీ అధిష్టానం నిర్ణయానికి కట్టుబడి ఎమ్మెల్యే అభ్యర్థి గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేసిన ప్రతి కార్యకర్తకు తాను అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. రాజేష్ కూడా అందుకు అనుగుణంగానే పనిచేస్తారని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, సింగిల్ విండో ఛైర్మన్ హరిబాబురెడ్డి, వైస్ ఎంపీపీ శ్యామలమ్మ, నాయకులు చిలమత్తూరు భాస్కర్‌రెడ్డి, చంద్రారెడ్డి, పాల సుబ్రమణ్యంరెడ్డి, వినోద్ యాదవ్, దుడ్డు వేణు, మాధవయ్య, శేఖర్, మహేంద్ర, శోభన్ యాదవ్, ప్రభాకర్, మునస్వామి యాదవ్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా కౌంటింగ్ విధులు


శిక్షణకు హాజరైన అధికారులు, సిబ్బంది,


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

- జూన్ 4న ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం
- జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి సిటీ : కౌంటింగ్ విధులను అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ ఆదేశించారు. బుధవారం తిరుపతి ఎస్వీయూ శ్రీనివాస ఆడిటోరియంలో కౌంటింగ్ సిబ్బందికి ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఉదయం 8 గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు.

ఓట్ల లెక్కింపులో రిటర్నింగ్ అధికారులు, ఏఆర్‌ఓలు, సూపర్‌వైజర్లు, సహాయకులు, మైక్రో అబ్జర్వర్లు సమన్వయంతో పనిచేసి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. పద్మావతి మహిళా వర్సిటీలో ఏడు అసెంబ్లీ, ఒక పార్లమెంట్ నియోజకవర్గం కౌంటింగ్ ఉంటుందని వెల్లడించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు విధులు కేటాయించిన అధికారులు ఓట్ల లెక్కింపు ప్రక్రియకు సంబంధించిన హ్యాండ్ బుక్‌ను క్షుణ్ణంగా చదవి అవగాహన చేసుకోవాలని సూచించారు. కౌంటింగ్ రోజున ఉదయం 7గంటలకు సిబ్బంది కేంద్రాలకు చేరుకోవాలని కోరారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియను పూర్తిగా వీడియో కవరేజ్‌తో పాటు ఎన్నికల సంఘం ప్రత్యేక పరిశీలన ఉంటుందన్నారు. కౌంటింగ్‌లో పాల్గొనే సిబ్బంది, రాజకీయ పార్టీల ఏజెంట్లు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు ధరించాలని ఆదేశించారు. ఆర్‌ఓలు ఈవీఎంలను పటిష్ట బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ కేంద్రాలకు చేర్చాలని చెప్పారు. కౌంటింగ్ కేంద్రాలలో టేబుల్స్ ఏర్పాటుతో పాటు పటిష్ట భద్రత కల్పించేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. సిబ్బంది మొబైల్స్ ఫోన్ తీసుకుని కౌంటింగ్ కేంద్రాలలోకి రాకూడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జేసీ ధ్యాన్ చంద్ర, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అతిథి సింగ్, రిటర్నింగ్ అధికారులు నిశాంత్‌రెడ్డి, రవిశంకర్ రెడ్డి, చంద్రముని, కిరణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అసెంబ్లీ సెగ్మెంట్	ఆర్‌ఓ	అబ్జర్వర్
వెంకటగిరి	హెచ్ఎం ధ్యానచంద్ర	జ్యోత్స్న విద్యాసాగర్
తిరుపతి	అధితీసింగ్	ఉజ్వల్ కుమార్ ఘోష్
చంద్రగిరి	నిషాంత్‌రెడ్డి	కైలాష్ వాంఖెడ్
గూడూరు	కిరణ్‌కుమార్	జ్యోతి
సూళ్లూరుపేట	చంద్రముని	ఉజ్వల్ కుమార్ ఘోష్
శ్రీకాళహస్తి	రవిశంకర్‌రెడ్డి	జ్యోత్స్న విద్యాసాగర్
సత్యవేడు	నరసింహులు	జ్యోతి

ఆర్‌ఓలు, అబ్జర్వర్ల పాత్ర కీలకం

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్‌లో రిటర్నింగ్ అధికారులు, అబ్జర్వర్ల పాత్ర కీలకమని జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయ్యేలా ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలకు ఆర్‌ఓలు, అబ్జర్వర్లు కృషి చేయాలని కోరారు.

ఆర్‌ఓలదే కౌంటింగ్ బాధ్యత


మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్‌కుమార్

తిరుపతి అర్బన్ : సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ బాధ్యత రిటర్నింగ్ అధికారులదేనని జిల్లా ఎన్నికల అధికారి,కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన కలెక్టరేట్‌లో రిటరినింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణంలో కౌంటింగ్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేవలం గుర్తింపు పొందిన పార్టీల అభ్యర్థులతోపాటు వారి ఏజెంట్లకు మాత్రమే కౌంటింగ్ కేంద్రంలోకి అవకాశం కల్పించాలని ఆదేశించారు. ఇతర పార్టీల అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులు, వారి ఏజెంట్లు కౌంటింగ్ ప్రక్రియను పరిశీలించడానికి వీలుగా అక్కడే ఓ హాల్‌లో టీవీలను ఏర్పాటు చేయాలని సూచించారు. కౌంటింగ్‌కు మూడు రోజుల ముందే ఆయా పార్టీల ఏజెంట్లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్లు, 8.30 గంటలకు ఈవీఎంల కౌంటింగ్ మొదలు అవుతుందని వెల్లడించారు. ఈ క్రమంలో ఉదయం 7 గంటలకు ముందే అధికారులు, సిబ్బంది కౌంటింగ్ కేంద్రానికి చేరుకోవాలని చెప్పారు. కౌంటింగ్ ప్రక్రియపై అవగాహన కోసం కలెక్టరేట్‌లో మోడల్ కౌంటింగ్ ప్రక్రియ నిర్వహించనున్నట్లు వివరించారు. రిటర్నింగ్ అధికారులు గురువారం ఆయా నియోకవర్గాల్లో అభ్యర్థులతో సమావేశం నిర్వహించి కౌంటింగ్ విధివిధానాలను వివరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ పెంచల కిషోర్, ఆర్‌ఓలు ధ్యానచంద్ర, అదితీసింగ్, నిషాంత్ రెడ్డి, కిరణ్ కుమార్, నరసింహులు, చంద్రముని, రవిశంకర్ రెడ్డి, నోడల్ అధికారులు రామ్మోహన్, చంద్ర శేఖర్‌రెడ్డి, కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

యోగ నృసింహుని వైభోగం

- కనులపండువగా పెనుశిల బ్రహ్మోత్సవాలు
- సింహవాహనంపై ఊరేగిన శ్రీవారు
- తిరుమంజనసేవలో సేదతీరిన దేవదేవేరులు
- పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులు


కోన మాడవీధుల్లో సింహవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహస్వామి


గరుడవాహనంపై నృసింహస్వామి

రాపూరు : పెంచలకోనలో పెనుశిల లక్ష్మీనరసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యోగ నరసింహుడు సింహ వాహనంపై వైభవంగా ఊరేగారు. బుధవారం శ్రీవారి జన్మదినం పురస్కరించుకుని ప్రత్యేక అలంకరణ చేపట్టారు. నృసింహజయంతి వేడుకలను తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు కోనకు తరలివచ్చారు. ఉదయం 6 గంటలకు స్వామి, ఆదిలక్ష్మీదేవి, ఆంజనేయస్వాములకు పూలంగిసేవ నిర్వహించారు. అనంతరం సింహ వాహన సేవ జరిపించారు. ఈ క్రమంలోనే ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో బు చతుష్టానార్చన హోమం చేశారు.

వేడుకగా స్నపన తిరుమంజనం

క్షేత్రంలోని క్రేన్ మండపంలో ఉదయం 11.30 గంటలకు దేవదేవేరులకు వేడుకగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, పంచామృతం, పసుపు, కొబ్బరి నీళ్లతో ఉత్సవ మూర్తులకు అభిషేకం చేశారు.

శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ

పెంచలకోనలో బుధవారం రాత్రి 7గంటలకు పెనుశిల లక్ష్మీనరసింహస్వామి, ఆదిలక్ష్మీదేవి, చెంచులక్ష్మీదేవిని తిరుచ్చి కొలువదీర్చి సహస్రదీపాలంకరణ మండపంలోకి వేంచేపు చేశారు. అనంతరం శాస్త్రోక్తంగా ఊంజల్‌సేవ జరిపించారు. కార్యక్రమంలో డీసీ విజయసాగర్‌బాబు, చెంగాళమ్మ ఆలయ ఏసీ వెంకటేశ్వర్లు, ఉప ప్రధానార్చకులు పెంచలయ్యస్వామి, సీతా రామయ్యస్వామి, టీటీడీ పాంచరాత్ర ఆగమపండితులు రామానుజాచార్యులు పాల్గొన్నారు.

గరుడునిపై శ్రీవారి విహారం

బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని బుధవారం రాత్రి గరుడవాహనంపై శ్రీవారు విహరించారు. పెద్దసంఖ్యలో భక్తులు స్వామివారిని భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు విశేష సేవలు

పెంచలకోన బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం 6 గంటలకు శ్రీవారికి పూలంగిసేవ, 9.30కి కల్యాణోత్సవం, సాయంత్రం 6 గంటలకు రథోత్సవం,రాత్రి 9 గంటలకు గజవాహనసేవ, రాత్రి 12 గంటలకు ఏకాంతసేవ నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు.

కరెంట్ తీగపై పడి గూడబాతు మృతి

– విద్యుత్ సరఫరాకు అంతరాయం

దొరవారిసత్రం : డీవీ సత్రం సమీపంలో ఉన్న 33కేవీ విద్యుత్ తీగలపై ఓగూడబాతు(పెలికాన్) బుధవారం పడి మృతి చెందింది. బాతు పడడంతో జంపర్లు తెగిపోయాయి. దీంతో డీవీ సత్రం, పూలతోట, తల్లంపాడు ప్రాంతాల్లోని 33/11కేవీ సబ్‌స్టేషన్ వచ్చే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో ఏఈ జగదీష్ సిబ్బందితో వెళ్లి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు.

